ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
మంగళవారం 26 మార్చి 2024



కుప్పం అభివృద్ధిని తిరిగి పట్టాలెక్కిస్తా



బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగం

వైసీపీ పాలనలో నాశనం చేశారు

బహిరంగ సభలో చంద్రబాబు



కుప్పం, మార్చి 25: 'కుప్పం అభివృద్ధికి 35 ఏళ్ల పాటు నేను పడిన కష్టాన్ని కేవలం ఐదేళ్ల వైసీపీ పాలనలో సర్వనాశనం చేశారు. అధికారంలోకి రాగానే తిరిగి అభివృద్ధిని పట్టాలెక్కిస్తా'నని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. దీనికి అవసరమైన అన్ని ప్రణాళికలు రచించి అమలు చేస్తామని చెప్పారు. తన రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం ఆయన కుప్పం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఆర్టీసీ బస్టాండు సర్కిల్లో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. రాష్ట్రంలో రెండంకెల అభివృద్ధి సాధిస్తే, కుప్పంలో మూడంకెల అభివృద్ధి తీసుకొస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఇంకా ఏం చెప్పారంటే..

శాటిలైట్ టౌన్‌షిప్‌గా కుప్పం

కుప్పాన్ని శాటిలైట్ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చేస్తా. తమిళనాడు, బెంగళూరుతో అనుసంధానం చేయడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతా. మేజర్ పంచాయతీకి రూ.కోటి, మైనర్ పంచాయతీకి రూ.రెండు కోట్ల చొప్పున ప్రత్యేక నిధులు కేటాయించి నిరంతర అభివృద్ధికి బాటలు వేస్తా. నేను చేసే అభివృద్ధి పనులకు ఈ నిధులు అదనం. ఇప్పుడున్న సర్పంచులను చూస్తే ఉత్సవ విగ్రహాలుగా ఉన్నారు. వారివల్ల ఇంతదాకా అయిందేమీ లేదు.

ఎడ్యుకేషన్ హబ్‌గా..

ప్రభుత్వ రంగంలోనూ పలు ఉన్నత విద్యా సంస్థలు ఏర్పాటు చేస్తా. దేశంలోని నలుమూలల నుంచి విద్యార్థులు ఇక్కడ వచ్చి చదువుకునేలా ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతా. తద్వారా స్థానిక ప్రజల జీవన భృతి పెంచుతా.

వన్యప్రాణుల నుంచి పంటలకు రక్షణ

టీడీపీ హయాంలో ఏనుగులు, ఇతర వన్యప్రాణుల కట్టడికి ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్తు కంచె, కందకాల నిర్వహణను జగన్‌రెడ్డి గాలికి వదిలేశారు. దీనివల్ల ఈ ఐదేళ్లలో వేల ఎకరాల పంట నష్టంతోపాటు కొందరు రైతులూ ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. కనీసం పంట, ప్రాణ నష్టపరిహారం కూడా ఇచ్చే దిక్కు లేకుండా పోయింది. నేను అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పొరపాట్లను సరిదిద్దుతా. కందకాలు, సోలార్ కంచెలను పునరుద్ధరించడంతో పాటు ఇంకా అవసరమైన చోట్ల వాటి నిర్మాణాలు చేపడతా.

పర్యాటకానికి పెద్దపీట

కుప్పంలో అపారమైన సహజ వనరులు, సుందరమైన ప్రాంతాలు ఉన్నాయి. అటువంటి వాటిలో ఒకటైన ననియాలను టీడీపీ పాలనలో రూ.4కోట్లతో పర్యావరణ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేశాం. వైసీపీ హయాంలో అక్కడి అసంపూర్తి పనులను పూర్తి చేయకపోగా, నిర్వహణనూ గాలికొదిలేసింది. టీడీపీ అధికారంలోకి వస్తే రామకుప్పం మండల పరిధిలోని అటవీ ప్రాంతాన్ని అంతర్జాతీయంగా పర్యావరణ ప్రాంతంగా తీర్చిదిద్దుతాం. నియోజవకర్గంలోని ప్రముఖ ఆలయాలను రూ.5 కోట్ల చొప్పున నిధులతో అభివృద్ధి చేస్తాం.

ఇంకా ఏం చేస్తామంటే..

- ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా కుప్పంలో వంద పడకల ఆస్పత్రిని 300 పడకలుగా అభివృద్ధి చేస్తాం. పేదలకు అత్యాధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తెస్తాం.
- రాళ్లబూదుగూరు, మల్లానూరు, విజలాపురం కేంద్రాలుగా కొత్త మండలాలను ఏర్పాటు చేస్తాం.
- కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.
- నాలుగు మండలాలలో అవసరమైన చోట్ల కోల్డ్ స్టోరేజీలు నిర్మిస్తాం. రైతులు ఇక్కడ తమ పంటలు నిల్వ ఉంచుకుని మంచి ధర పలికినప్పుడు అమ్ముకోవచ్చు.
- ముస్లిం ఆవాస ప్రాంతాల్లో మసీదులను అభివృద్ధి చేయడంతో పాటు షాదీఖానాలు నిర్మిస్తాం.
- 2014-2019 మధ్య మంజూరైన పక్కా ఇళ్లకు బిల్లులు చెల్లించి పేద లబ్ధిదారులను ఆదుకుంటాం.
- కుప్పం నియోజకవర్గంలో పండే అన్ని పంటల దిగుబడులను విదేశాలకు ఎగుమతి చేసేందుకు ఎయిర్ స్ట్రిప్ ఏర్పాటు చేస్తాం.
- హంద్రీ-నీవా కాలువ ద్వారా అన్ని చెరువులు నింపి శాశ్వతంగా తాగునీటి కష్టాలను దూరం చేస్తాం.
- కుప్పం గ్రానైట్ పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందించి యువతకు ఉద్యోగావకాశాలు పెంపొందిస్తాం.



నేతలతో కలిసి రాష్ట్రమా.. మేలుకో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చంద్రబాబు

ఇక్కడినుంచే మహిళా సాధికారత

- మీ కష్టాలకు కరిగాను కనుకే సంక్షేమ, ఉన్నతి పథకాలకు రూపకల్పన
- కుప్పం కుటుంబ మహిళా సాధికారతా సభ్యుల సమావేశంలో చంద్రబాబు

కుప్పం, మార్చి 25: 'మీ కష్టాలు చూశా. కరిగిపోయా. వాటి నుంచి బయట పడేయాలన్న ప్రధాన ఉద్దేశంతోనే మహిళా సాధికారత కల్పించాలని పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలకు కుప్పంనుంచే శ్రీకారం చుట్టాను' అని చంద్రబాబు పేర్కొన్నారు. కుప్పంలోని టీడీపీ కార్యాలయం ఎదుట క్లస్టర్ ఇన్‌చార్జి ప్రతాప్ సమీకరణలో సోమవారం ఏర్పాటు చేసిన కుటుంబ మహిళా సాధికారతా సభ్యుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గతంలో తాను అధికారంలో ఉన్నప్పుడు మహిళలకోసం అమలు



చేసిన పథకాల గురించి చంద్రబాబు వివరించారు. ఇప్పుడు అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధికింద ప్రతి మహిళకు రూ.15 వేలు, ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వంటి పథకాలు అమలు చేస్తామన్నారు. మహిళల ఆదాయాన్ని రెండు రెట్లు పెంచడానికి హామీ ఇస్తున్నానని తెలిపారు.

మగాళ్లకు చెప్పి ఓట్లేయించండి : 'టీడీపీ వల్ల మీకు ఎంతో మేలు జరిగింది. ఆ నిజం మీకు తెలుసు. అందువల్ల ఎన్నికల్లో టీడీపీకి ఓటేయమంటూ ఇంట్లో మగాళ్లను డిమాండు చేయండి. లేదంటే భోజనం పెట్టేది లేదని చెప్పండి. మీ భవిష్యత్తుకోసం, రాష్ట్రం కోసం 40 రోజులపాటు పనిచేయండి' అని పిలుపునిచ్చారు. వైసీపీ దుర్మార్గ పాలనలో ఆడబిడ్డలకు రక్షణ కరవైందని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి తాగి, తల్లీబిడ్డలకు తేడా లేకుండా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. డ్రగ్స్ మాఫియానూ ప్రస్తావించారు. 'మీరంతా రాజకీయాల్లోకి రావాలి. ఆ వేగానికి మగవాళ్ల కుర్చీలు వెదుక్కోవాలి' అంటూ చంద్రబాబు చమత్కరించారు.

రాళ్లు, ఇసుక దోపిడీ

కుప్పంలో రాళ్లు, ఇసుకనూ వైసీపీ మూకలు దోచుకుంటున్నాయని చంద్రబాబు ధ్వజమెత్తారు. అడిగినవాళ్లపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులపాలు చేస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక, ఆ దుర్మార్గుల పనిపడతామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్. సురేశ్‌బాబు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి వీజీ.ప్రతాప్ తదితరులతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెయ్యెత్తి నినదించిన నారీమణులు



కుప్పం వస్తే రీఛార్జి అవుతా

మహిళలు ఉత్సాహంగా, అధిక శాతం మంది సమావేశంలో పాల్గొనడం చూసి చంద్రబాబు పొంగిపోయారు. ఇదే ఉత్సాహంతో ఎన్నికలకు వెళ్లాలని, అదే జరిగితే టీడీపీకి భారీ మెజారిటీ ఖాయమని స్పష్టంచేశారు. 'టోపీలు, కండువాలతో మిమ్మల్ని చూస్తుంటే నాకు ఫుల్ జోష్ వస్తుంది. కుప్పం వస్తే పూర్తిగా రీఛార్జి అవుతాను. ఇక్కడినుంచి మిగిలిన నియోజకవర్గాల ప్రచారంలో పాల్గొంటాను' అని పేర్కొన్నారు.

జనమా.. పసుపు దళమా!

పసుపు జెండాలు.. తోడుగా జనసేన, బీజేపీ పతాకాలు, మాటమాటకూ కేరింతలు, హామీలకు ఈలలు. వైసీపీపై నిప్పులు చెరుగుతుంటే ఆవేశాలు.. లక్ష మెజారిటీ పిలుపునకు సానుకూల స్పందనలు.. ఇదీ చంద్రబాబు తొలిరోజు బహిరంగ సభకు లభించిన జనస్పందన. మధ్యాహ్నం దాటినా తగ్గని మండుటెండ.. అప్పటికి ఒకట్రెండు గంటలుగా ఎదురుచూస్తున్న జనం డస్సి పోలేదు. తమ అభిమాన నాయకుడి కోసం ఎదురు తెన్నులు చూస్తూనే ఉన్నారు. చంద్రబాబు బహిరంగ సభా ప్రాంగణం చేరుకుని వేదిక నెక్కే సమయంలో ఉత్సాహంతో కదం తొక్కారు. సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటలదాకా సాగిన ఆయన ప్రసంగాన్ని ఆసాంతం శ్రద్ధగా ఆలకించారు. వైసీపీ విధ్వంసకర పాలన గురించి, ప్రజలకు, రాష్ట్రానికి జరుగుతున్న నష్టం గురించి చెబుతుంటే ఆవేదనకు లోనయ్యారు. టీడీపీ అధికారంలోకి వస్తే, చేయబోయే అభివృద్ధి గురించి, బాగుపడబోయే బతుకుల గురించి చెబుతుంటే ఆశావహంతో కనిపించారు. ప్రత్యేకించి కుప్పం అభివృద్ధికి తనకున్న ప్రణాళికల గురించి చెబుతుంటే ఈలలతో స్వాగతించారు. అంతకుముందు మహిళా కుటుంబ సాధికార సారథులతో జరిగిన సమావేశంలోనూ ఇదే ఉత్సాహం కనిపించింది. మహిళా సాధికారతకోసం తానేం చేయబోతానో, ఎలా వారిని ఉన్నత స్థితికి తీసుకు రానున్నానో అధినేత చెబుతుంటే మహిళలు పొంగిపోయారు.



చంద్రబాబు సభలో కూటమి జెండాల రెపరెపలు

వెనక్కి వచ్చేయండి


చిత్తూరు కలెక్టరేట్, మార్చి 25: ఎన్నికల కోడ్ నేపథ్యంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులుకు కేటాయించిన ఉద్యోగులందరినీ వెనక్కి తీసుకున్నారు. జడ్పీ సీఈవో గ్లోరియా ఆదేశాలతో చైర్మన్ వద్ద క్యాంపు క్లర్క్ సురేంద్రరెడ్డి (సూరి) వెనక్కి వచ్చి జీడీనెల్లూరు మండలపరిషత్తు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా తన యథాస్థానంలో చేరారు. ఆఫీసు సబార్డినేట్ పొన్నుస్వామి కూడా వెనక్కి వచ్చారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్(మంగళవారం):సా. 6.27
సహరి (బుధవారం) : ఉ. 4.53

సీఎం ఫొటోతో తంటా

- ఆగిన సర్టిఫికెట్ల జారీ
- జూన్ నెలలో రమ్మంటున్న సచివాలయ సిబ్బంది
- ప్రత్యామ్నాయం చూపని యంత్రాంగం
- ఇబ్బందుల్లో విద్యార్థులు, రైతులు

చిత్తూరు కలెక్టరేట్ / గుడిపాల, మార్చి 25: సీఎం జగన్ ఫొటోల పిచ్చి రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. సర్టిఫికెట్లపై సీఎం ఫొటోలు ఉండటంతో.. ఎన్నికల కోడ్ వల్ల వీటి జారీకి బ్రేక్ పడింది. దీనికి ప్రత్యామ్నాయమూ చూపకపోవడంతో సమస్యగా మారింది. పిల్లలను విద్యాలయాల్లో చేర్పించాలంటే పుట్టిన తేది సర్టిఫికెట్లు, కులధ్రువీకరణ, ఆదాయ, ఈబీసీ సర్టిఫికెట్లు అవసరం. మరోవైపు రైతులు వ్యవసాయ రుణాలు రెన్యూవల్ చేయాలంటే బ్యాంకులకు 1బి జతపరచాలి. వీటితో పాటు ఈ-పోస్, అడంగళ్, ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలకోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటారు. వాటిని సంబంధిత తహసీల్దార్ కార్యాలయాలకు పంపించి, అన్ని దశల్లో పరిశీలించాక సర్టిఫికెట్లు జారీచేస్తారు. ఇలా సర్టిఫికెట్లను అవసరమైన చోట్ల విద్యార్థులు, రైతులు దరఖాస్తుతో పాటు జతచేయాలి. ఈ ప్రక్రియ పూర్తికావడానికి 10 నుంచి 15 రోజులు పడుతుంది. సచివాలయంలో ముందు దరఖాస్తు చేయాలి. కానీ, వారం రోజులుగా అక్కడ దరఖాస్తులు స్వీకరించడం లేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సర్టిఫికెట్లు జారీకావని వెనక్కి పంపుతున్నారు. జూన్‌లో రావాలని చెబుతున్నారు. ఎన్నికలకు, సర్టిఫికెట్లకు సంబంధం ఏమిటని ప్రశ్నిస్తే.. ప్రభుత్వ లోగోతో పాటు సీఎం ముఖచిత్రం ఉందని, ఆ కారణంగా ఎన్నికల సంఘం సర్టిఫికెట్ల జారీపై నిషేధం విధించిందంటున్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు, రైతులకు, ఇతరత్రా వారికి కావాల్సిన సర్టిఫికెట్లు పది కాలాల పాటు భద్రపరచుకునే పత్రాలపై ఇలా సీఎంల ఫొటోలు ఎలా ముద్రిస్తారని ప్రశ్నిస్తున్నారు. సీఎం ఫొటోలేని ధ్రువపత్రాలు ముద్రించి, వెంటనే సచివాలయాలకు పంపేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సర్టిఫికెట్లపై సీఎం జగన్ బొమ్మ

ఆలయాల్లో చంద్రబాబు పూజలు

కుప్పం, మార్చి 25: చంద్రబాబు సోమవారం మధ్యాహ్నం పీఈఎస్ హెలిప్యాడ్ చేరుకుంటేనే అక్కడి నుంచి నేరుగా కుప్పం పట్టణం కొత్త పేటలోని వినాయకస్వామి ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడినుంచి బయలుదేరి సమీపంలో ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయం చేరుకున్నారు. ఈ ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలతో కూడిన సారె సమర్పించారు. జీర్ణోద్ధరణ, ప్రతిష్ఠ మహా కుంభాభిషేకంలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ పూజారులు చంద్రబాబుకు అమ్మవారి ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న చంద్రబాబు

మీకు అన్యాయం జరగనివ్వను!

● ఇఫ్తార్ విందులో ముస్లింలతో చంద్రబాబు

కుప్పం, మార్చి 25: 'చరిత్ర చూడండి, మీకు మేలు చేయడం తప్ప ఏనాడూ అపకారం చేసిన చరిత్ర టీడీపీకి లేదు. నన్ను నమ్మండి. నేను సీఎంగా ఉన్నంత వరకూ మీకు అన్యాయం జరగనివ్వను' అని ముస్లిం సోదరులకు చంద్రబాబు భరోసా ఇచ్చారు. కుప్పంలోని కేవీఆర్ కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం ఆయన ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్డీయేతో కలిసి పనిచేశామన్నారు. అప్పట్లోనే ముస్లింలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని గుర్తుచేశారు. కర్నూలులో ఉర్దూ యూనివర్శిటీ తీసుకొచ్చామన్నారు. అనంతర కాలంలో పేద ముస్లిం ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం షాదీతోఫా పేరుతో రూ.లక్ష ఇచ్చామన్నారు. ముస్లిం యువతకు ఉపాధికోసం రూ.3 లక్షలు ఇవ్వడమేకాక, అందులో రూ.లక్ష సబ్సిడీ ఇచ్చామని వివరించారు. మసీదులు, ఖబరస్తాన్‌లు, షాదీ మహల్‌లు అభివృద్ధి చేశామన్నారు. ఇప్పుడీ ప్రభుత్వం ఏమి చేసిందని ప్రశ్నించారు. మైనారిటీలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు ఎక్కువైపోయాయన్నారు. నంద్యాలలో అబ్దుల్ బాషాను చంపేశారని, కడప జిల్లాలో ఒక ముస్లిం కుటుంబం ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారన్నారు. పలమనేరు నియోజకవర్గంలో ముస్లింల ఆడబిడ్డ చదువుకుని మంచి ర్యాంకు సాధించే ఆమెను అవమానాల పాలు చేసి ఆత్మహత్యకు పురికొల్పారని, పుంగనూరులో 12 మందిని అక్రమ కేసుల్లో జైలుకు పంపించిన ఘనత కూడా వైసీపీదేనన్నారు. మసీదు స్థలం ఆక్రమణను ప్రశ్నించిన పాపానికి గుంటూరులో ఒక వ్యక్తిని వైసీపీ మూకలు దాడులు చేసి చంపేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుప్పంలోనూ అనేక మంది ముస్లింలపైన కేసులు పెట్టి వేధించారన్నారు. ఇలాంటి దాడులు, దౌర్జన్యాలు, అక్రమాలు చూసి, రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలనే మూడు పార్టీలు కలిసి ఎన్నికలకు వెళ్తున్నామని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలన్నా, సంక్షేమం అందించాలన్నా కేంద్రం సాయం అవసరమన్నారు. వాళ్ల దగ్గరకి తాను వెళ్లలేదని, వాళ్లు పిలిస్తే వద్దనలేదని అన్నారు. 'మనసులో ఏమీ పెట్టుకోవద్దు. నేను ముఖ్యమంత్రిగా ఉండేంత వరకు మీకు అండగా ఉంటాను' అని చంద్రబాబు హామీ ఇచ్చారు.



రూ.5.45 లక్షల కర్ణాటక మద్యం స్వాధీనం

- ఇద్దరి అరెస్టు



సీజ్ చేసిన మద్యంతో ఎస్ఈబీ పోలీసులు

కుప్పం, మార్చి 25: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5.45 లక్షల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కుప్పం ఎస్ఈబీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుడుపల్లె మండలం సోడిగానిపల్లె వద్ద తమకు అందిన సమాచారంతో సోమవారం తనిఖీలు చేపట్టారు. ఓ కారు కర్ణాటక సరిహద్దు నుంచి అనుమానాస్పదంగా రావడం గమనించి ఆపి, తనిఖీ చేశారు. అందులో కర్ణాటకకు చెందిన 30 బాక్సుల సిల్వర్ కప్ 90 ఎంఎల్ 2,880 టెట్రా మద్యం ప్యాకెట్లు, 60 బాక్సుల ఓసీ ఒరిజినల్ చాయిస్ 5,760 మద్యం ప్యాకెట్లు బయటపడ్డాయి. వీటిని కర్ణాటక నుంచి సోడిగానిపల్లెకు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వాహనంలోని కర్ణాటక రాష్ట్రం కెంపాపురం గ్రామానికి చెందిన వెంకటేష్, గుడిపల్లె మండలం అనగానిపల్లెకి చెందిన ఏఎస్ మంజునాథ్‌లను అరెస్టు చేశారు. మద్యంతోపాటు కారును, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.5.45 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఈబీ సీఐ సృజన బాబు, ఎస్ఐ అన్వేశ్, హెడ్ కానిస్టేబుళ్లు నాగరాజ్, శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు ఉమాహేశ్, దేవేంద్ర, మధు, రఘు పాల్గొన్నారు. సిబ్బందిని చిత్తూరు సెబ్ డీఎస్ఈవో సుబ్బరాజు అభినందించి, క్యాష్ రివార్డులు అందజేశారు.

పుంగనూరులో రూ.2.14 లక్షల సీజ్

పుంగనూరు, మార్చి 25: సరైన బిల్లులు, నగదుకు సంబంధించిన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.2,14,200 సీజ్ చేసి కలెక్టరేట్‌లో డిపాజిట్ చేసినట్లు పుంగనూరు సీఐ రాఘవరెడ్డి తెలిపారు. సోమవారం పుంగనూరు సమీపంలోని మాగాండ్లపల్లె చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి రామసముద్రం వెళ్లే కారును పరిశీలించారు. అందులో ఉన్న కర్ణాటకకు చెందిన కలీం, అబ్దుల్‌బాషాల వద్ద రూ.2,14,200కు బిల్లులు అడగ్గా లేవని, తాము పుచ్చకాయ వ్యాపారులమని చెప్పారు. ఆధారాలు లేకుండా ఎన్నికల కోడ్ సమయంలో డబ్బులు తీసుకెళ్లరాదన్నారు. వారంలోగా ఆధారాలు చూపి డబ్బు తీసుకెళ్లవచ్చని, వారి నుంచి నగదు సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

సదరం క్యాంపులో విచిత్రంపై డీసీహెచ్ఎస్ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పుంగనూరు, మార్చి 25: పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సదరం క్యాంపునకు వచ్చినట్లు, వికలత్వం లేకపోయినా కడప జిల్లాకు చెందిన అమరనాథ్‌నాయక్‌కు సర్టిఫికెట్ జారీ కావడంపై చిత్తూరు డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఆరా తీశారు. 'పుంగనూరు సదరం క్యాంపులో విచిత్రం' అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన డీసీహెచ్ఎస్ దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన ఆచారితో మాట్లాడి, నివేదిక ఇవ్వాలని సూచించారు. మానవ తప్పిదం కారణంగా వేరే రోగి వివరాలు అమరనాథ్ నాయక్ పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు అయ్యాయని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. దీనిపై డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ.. సోమవారం సెలవు కావడం వల్ల.. మంగళవారం సర్టిఫికెట్ రద్దు చేయిస్తామని చెప్పారు.

కొనసాగిన ఇంటర్ మూల్యాంకనం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 25: ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం కొనసాగింది. ఈనెల 18న ప్రారంభమైన మూల్యాంకనం ప్రక్రియ ఏప్రిల్ 4వ తేదీ వరకు కొనసాగనుంది. అందులో భాగంగా సోమవారం జరిగిన మూల్యాంకనంలో 44 మంది ముఖ్య పరీక్షలు, 224 మంది సహాయక పరీక్షకులు పాల్గొన్నట్లు డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. ఇదిలా ఉండగా, టెన్త్ జవాబు పత్రాల డీకోడింగ్ ప్రక్రియ స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగింది. ఏప్రిల్ ఒకటి నుంచి టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకనం జరగనుంది. కాగా ఏప్రిల్ 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సమ్మెటివ్ అసెస్మెంట్-2 పరీక్షలు జరగనున్నాయి.

కాణిపాకంలో సత్యనారాయణస్వామి వ్రతం



ఐరాల(కాణిపాకం), మార్చి 25: కాణిపాకంలోని వరదరాజస్వామి ఆలయంలో సోమవారం ఉదయం పౌర్ణమి సందర్భంగా మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి పూజ, వ్రతాన్ని నిర్వహింపచేశారు. అనంతరం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి కాణిపాకం పుర వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చల్లా బాబును గెలిపించుకురండి

టీడీపీ శ్రేణులకు చంద్రబాబు పిలుపు - వైసీపీనుంచి టీడీపీలో చేరిన వెంకటరమణరాజు

పుంగనూరు, మార్చి 25: పుంగనూరు అసెంబ్లీ ఎన్నికల్లో చల్లా బాబు (రామచంద్రారెడ్డి)ని గెలిపించుకుని రావాలని పార్టీ శ్రేణులకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి కుప్పం టీడీపీ కార్యాలయంలో చల్లా బాబు మాజీ సీఎంను కలిశారు. ఈ సందర్భంగా గతంలో రెండు పర్యాయాలు పుంగనూరు టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెంది.. 2019 ఎన్నికల సమయంలో వైసీపీలో చేరిన ఎం.వెంకటరమణరాజును చంద్రబాబు టీడీపీలోకి ఆహ్వానిస్తూ పార్టీ కండువా కప్పారు. పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డిని లైట్‌గా తీసుకోవద్దని, చల్లా బాబు గెలుపుకోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వెంకటరమణరాజు అన్నారు. అందుకు చంద్రబాబు మాట్లాడుతూ.. పుంగనూరులో గతంకంటే పార్టీ పరిస్థితి బాగుందన్నారు. అయినా 'మీరు చేయాల్సింది మీరు చేయండి, నేను చేసేది నేను చేస్తా' అన్నారు. అలాగే పుంగనూరు పుంగనూరు మున్సిపల్ కౌన్సిలర్ ఎం.రామకృష్ణమరాజు, వైసీపీ యువ నాయకులు ఆర్వీటీ బాబు, ఎం.ప్రదీప్‌రాజులకు కూడా టీడీపీ కండువాలను చంద్రబాబు కప్పారు. టీడీపీ గెలుపుకోసం పనిచేయాలని, రాబోయేదీ మన ప్రభుత్వమేనని భరోసా ఇచ్చారు. నాయకులు దినేశ్, గువ్వల రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంకటరమణరాజును టీడీపీలోకి ఆహ్వానించిన చంద్రబాబు

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు
● చంద్రబాబు పరామర్శ





చలమయ్య మృతదేహం వద్ద చంద్రబాబు - నాగభూషణం ఆరోగ్య పరిస్థితిపై మాట్లాడుతున్న చంద్రబాబు

కుప్పం రూరల్, మార్చి 25: చంద్రబాబు బహిరంగ సభకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతూ రోడ్డు ప్రమాదంలో ఒక కార్యకర్త మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రామకుప్పం మండలం ఆనిగానూరు గ్రామానికి చెందిన చలమయ్య, నాగభూషణం సోమవారం సాయంత్రం కుప్పంలో జరిగిన చంద్రబాబు సభకు హాజరయ్యారు. తర్వాత స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కుప్పం మండలం గుట్టపల్లె వద్ద వీరిని ఎదురుగా అతివేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం స్థానికులు వీరిని పీఈఎస్ ఆస్పత్రిలో చేర్చారు. ఇక్కడ చికిత్స పొందుతూ సుమారు రాత్రి 8 గంటల ప్రాంతంలో చలమయ్య (32) మృతి చెందారు. నాగభూషణం చికిత్స పొందుతున్నారు. కాగా, చంద్రబాబు రాత్రి పది గంటల ప్రాంతంలో పీఈఎస్ ఆస్పత్రికి వెళ్లి చలమయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. చికిత్స పొందుతున్న నాగభూషణాన్ని చూసి.. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

రూ.12 లక్షల వెండి ఆభరణాలు స్వాధీనం

చిత్తూరు, మార్చి 25: అక్రమంగా తరలిస్తున్న రూ.12 లక్షలు విలువ చేసే 15కేజీల వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను రెండో పట్టణ సీఐ ఉలసయ్యతో కలిసి డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి సోమవారం మీడియాకు వివరించారు. సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. స్థానిక ఇరువారం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బెంగళూరు వైపు నుంచి చిత్తూరుకు వస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా, కృష్ణాజిల్లా లక్ష్మీపురం పోరంకికి చెందిన ఫణీంద్ర (42) ఎలాంటి రశీదులు లేకుండా రూ.12లక్షల విలువ చేసే 15 కేజీల వెండి తీసుకొస్తున్నారు. వెండి వస్తువులకు సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోవడంతోనే సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వాటికి సరైన బిల్లులను చూపించి, వెండి వస్తువులను తీసుకెళ్లొచ్చన్నారు. వెండి వస్తువులు పట్టుకోవడంలో కృషిచేసిన ఎస్ఐ ప్రసాద్, ఇక్బాల్, నగరపాలక సిబ్బంది గోపి, గోపాలకృష్ణ వర్మను డీఎస్పీ అభినందించారు.



వెండి ఆభరణాలను మీడియాకు చూపిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

నేడు సుప్రీం సీజే తిరుపతి రాక

తిరుపతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి ధనుంజయ వై చంద్రచూడ్ రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం తిరుపతి రానున్నారు. కలెక్టరేట్‌కు అందిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం 9 గంటలకు బెంగళూరు నుంచి విమానంలో బయల్దేరి 10 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. ఉదయం 11 గంటలకు తిరుపతి ఎస్వీయూలో లా కోర్సులు ప్రారంభించి పదేళ్ళవుతున్న సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ లీగల్ ఎడ్యుకేషన్ (న్యాయ విద్యలో కృత్రిమ మేధ) అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న వర్కుషాపును ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించి న్యాయ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు మహాలక్ష్మీ పావని, జేబీ గుప్తా తదితరులు కూడా హాజరు కానున్నారు.రాత్రి 8 గంటలకు బయల్దేరి తిరుమల చేరుకునే సీజే రాత్రికి అక్కడే బస చేస్తారు. బుధవారం వేకువ జామున కుటుంబంతో శ్రీవారిని దర్శించుకుని ఉదయం 9 గంటలకు బయల్దేరి తిరుపతి చేరుకుంటారు. 11.30 గంటలకు విమానంలో బయల్దేరి హైదరాబాదు వెళ్ళనున్నారు.

శ్రీపురంలో అచ్చెన్నాయుడు దంపతులు



చిత్తూరు కల్చరల్, మార్చి 25: రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు దంపతులు సోమవారం వేలూరు బంగారు గుడిలో మహాలక్ష్మీదేవికి పూజలు చేశారు. వారికి ఆలయ పీఆర్వో కల్యాణచక్రవర్తి స్వాగతం పలికి, పూజలకు ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు నారాయణి అమ్మను దర్శించుకుని, ఆశీస్సులు అందుకున్నారు. అచ్చెన్నాయుడు దంపతులకు ఆలయ ట్రస్టీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు తిరుమలకు చిరంజీవి

తిరుపతి అర్బన్, మార్చి 25: ప్రముఖ సినీనటుడు చిరంజీవి, ఆయన తనయుడు రాంచరణ్ కుటుంబ సభ్యులతో మంగళవారం తిరుపతికి రానున్నారు. ప్రత్యేక విమానంలో సాయంత్రం 4గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడినుంచి రోడ్డు మార్గంలో తిరుమల చేరుకుని రాత్రికి బసచేస్తారు. బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు. సాయంత్రం హైదరాబాదుకు తిరుగుప్రయాణమవుతారు.

శ్రీవారి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ

తిరుమల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రాత్రి జరిగిన గరుడసేవలో పాల్గొన్న ఆయన నైవేద్య విరామ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా, ప్రముఖ సినీ హీరో వెంకటేష్ కుమార్తె హయావాహిని దంపతులు శ్రీవారిని దర్శించుకున్నారు. కొత్తగా పెళ్లయిన హయావాహిని, నిషాంత్ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.

శ్రీవారి ఆలయం ముందు జస్టిస్ ఎన్వీ రమణ



తొలిరోజు చంద్రబాబు పర్యటన ఇలా....



సభలో మేడలెక్కిన అభిమానం

కుప్పం, మార్చి 25: సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు కుప్పం పీఈఎస్ హెలిప్యాడ్‌కు చంద్రబాబు చేరుకున్నారు. కొత్తపేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఒంటి గంటకు పూజల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత టీడీపీ కార్యాలయానికి చేరుకుని అరగంట పాటు బస్సులో భోజన విరామం తీసుకున్నారు. 1.45 నుంచి 2.55 గంటల దాకా మహిళా కుటుంబ సాధికార కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. 2.55 నుంచి సాయంత్రం 3.45 గంటలదాకా పార్టీ కార్యాలయంలో నాయకులతో మంతనాలు జరిపారు. ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో సాయంత్రం 4 నుంచి సాయంత్రం 5.30 గంటలదాకా బహిరంగ సభలో పాల్గొన్నారు. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు వెళ్లారు. అక్కడ్నుంచి కేవీఆర్ కల్యాణ మండపానికి చేరుకుని సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.15 గంటల దాకా ముస్లిం సోదరులతో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అక్కడినుంచి టీడీపీ కార్యాలయం చేరుకుని రాత్రి సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశమై ఎన్నికల్లో వ్యూహ రచనపై చర్చలు జరిపారు.

నేటి షెడ్యూల్ ఇదే

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు: కేవీఆర్ కల్యాణ మండపంలో వివిధ పార్టీలనుంచి చేరికలు

1- 1.30:	బాబు నగర్‌లో ఇంటింటి ప్రచారం
1.40- 2.30:	విరామం
2.30- 3.30:	టీడీపీ నాయకులతో సమీక్షా సమావేశం
4.30-5:	రామకుప్పం మండలం రాజుపేట గ్రామం వద్ద హంద్రీ-నీవా కాలువ పరిశీలన
సాయంత్రం 6- 7.45:	పార్టీ నాయకులతో సమావేశం
8.00:	ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో రాత్రి బస

రేపు పలమనేరులో ప్రజాగళం

● రాష్ట్రంలో తొలిసారిగా జిల్లాలో ప్రారంభం
● విజయవంతం చేయండి: అమర్

పలమనేరు, మార్చి 25: టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం పలమనేరులో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు చేపడుతున్న ప్రజాగళం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోనే తొలిసారిగా 27న ఉదయం 9.30 గంటలకు పలమనేరు జవళి వీధిలో కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. రోజూ మూడు నుంచి నాలుగు నియోజకవర్గాల్లో చంద్రబాబు పర్యటిస్తారని తెలిపారు. ప్రజలు వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి ఇబ్బందులు పడుతున్నారో తెలుసుకుని.. వారి గళాన్ని రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేయడమే ఈకార్యక్రమ ముఖ్యఉద్దేశమన్నారు. దాంతోపాటు జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే జరిగే పరిణామాలను ప్రజలకు వివరించడంతోపాటు ఈ ఐదేళ్లలో అరాచక పాలనను తెలియజేయడం జరుగుతుందన్నారు. అందువల్ల నియోజకవర్గ ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా పార్టీ ప్రధానకార్యదర్శి కోదండయాదవ్, నాయకులు రామచంద్రనాయుడు, ఖాజాపీర్, వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.95 కోట్లు

తిరుమల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.95 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 80,532 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 29,438 మంది తలనీలాలు సమర్పించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

వైసీపీనుంచి టీడీపీలో చేరిన బీసీలు



టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి 25: గాంధీనగర్, గంటావూరు, మేలుమాయి ప్రాంతాల నుంచి వైసీపీకి చెందిన పలువురు బీసీలు పలమనేరులోని టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో సోమవారం తెలుగుదేశంలో చేరారు. వీరందరికీ ఆయన టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో.. ఈశ్వరదేవర్, శశికుమార్, గణేష్, కదిరేష్, అరుణ్, సెల్వకుమార్, రాజేందర్, నాగరాజు, మలయరాజు, పళని, కన్నన్, సౌందర్రాజన్, భాగ్యరాజ్, వాసుఆచారి, రెడ్డిశేఖరాచారి, వీరభద్ర, కేశవ, సుబ్రహ్మణ్యం, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, విజయ్, నవీన్‌కుమార్, అర్జున్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు రవి, టీడీపీ మైనారిటీ అధ్యక్షుడు ఖాజాపీర్, రాష్ట్రరైతు విభాగం కార్యదర్శి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి రథోత్సవం



శాంతిపురం, మార్చి 25: రాళ్లబూదుగూరులోని శ్రీదేవిభూదేవి సమేత కోదండరామస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. మూడు రాష్ట్రాలకు చెందిన భక్తులు తరలి రావడంతో గ్రామ వీధులు కిక్కిరిశాయి. ఆలయ కమిటీ వారు అన్నదానం, పెసలపప్పు పానక ప్రసాదాలు పంచిపెట్టారు. రాళ్లబూదుగూరు పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

పౌర్ణమి వేడుకలు



ఎర్రనాగులపల్లెలో లక్ష్మీ నరసింహస్వామికి పూజలు

సోమల, మార్చి 25: ఎర్రనాగులపల్లెలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. గంగిరెడ్డిపల్లె, మేటిమంద, నడింపల్లె, ఎమ్మెవారిపల్లె గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

కల్లూరు: పులిచెర్ల మండలం దేవళంపేటలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సోమవారం కదిరి పున్నమి వేడుకలు జరిగాయి. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలతోపాటు ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ప్రధాన అర్చకుడు అనంతకుమారాచార్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మార్గసాహేశ్వరస్వామి సేవలో అమర్



బైరెడ్డిపల్లె, మార్చి 25: నెల్లిపట్ల గ్రామంలోని మార్గసాహేశ్వర స్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా సోమవారం జరిగిన రథోత్సవంలో మాజీమంత్రి అమరనాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూలవర్లను దర్శించుకున్నారు. ఆయనకు టీడీపీ నాయకులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు.

కందూరులో గంగ జాతరకు చాటింపు

సోమల, మార్చి 25: కందూరులో గంగ జాతర నిర్వహణకు ఆదివారం అర్ధరాత్రి చాటింపు వేశారు. ఈ సందర్భంగా నడివీధి గంగమ్మ ఆలయం వద్ద అఖండ జ్యోతిని ఏర్పాటు చేసి, అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈనెల 31వ తేదీ రాత్రి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, సోమవారం గంగజాతర వేడుకలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

హెరిటేజ్ పార్లర్ ప్రారంభం

వి.కోట, మార్చి 25: వి.కోట పట్టణంలో నెర్నపల్లె సమీపంలో హెరిటేజ్ సంస్థ ఔట్‌లెట్ (పార్లర్)ను మాజీ మంత్రి అమరనాథరెడ్డి సోమవారం ప్రారంభించారు. నిర్వాహకుడు జయప్ప, సంస్థ డైరెక్టర్ రామచంద్రనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్, మాజీ వైస్ ఎంపీపీ గోపినాథ్, నేతలు శబరీష్, కోదండరెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చౌడేపల్లెలో బీసీవై సభ

చౌడేపల్లె, మార్చి 25: చౌడేపల్లెలోని బస్టాండు వద్ద బీసీవై బహిరంగ సభను మంగళవారం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకుడు హరిప్రసాద్ యాదవ్ తెలిపారు. ఈ సభకు పార్టీ అధినేత రామచంద్రయాదవ్ పాల్గొంటారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం



ఇఫ్తార్ విందుకు హాజరవుతూ..



మహిళా నేతల నుంచి జ్ఞాపిక అందుకుంటూ..



చంద్రబాబుకు అభివాదం చేస్తున్న జనం



స్థానికులకు చంద్రబాబు అభివాదం

కుప్పం, మార్చి 25: టీడీపీ అధినేత, స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబునాయుడు సోమవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో బెంగళూరు విమానాశ్రయం నుంచి కుప్పం పీఈఎస్ హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. ఇక్కడ ఆయనకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబుతో పాటు ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసేన శ్రేణులు ఆయనకు పూలమాలలు వేసి, బొకేలు అందించి స్వాగతం పలికాయి.

వైసీపీ అరాచక పాలనకు త్వరలోనే చరమగీతం

- పుంగనూరులో టీడీపీ గెలుపు ఖాయం
- చల్లా రామచంద్రారెడ్డి



పుంగనూరులో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన యువకులతో చల్లా బాబు

పుంగనూరు, మార్చి 25: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి (బాబు) చెప్పారు. సోమవారం పుంగనూరులోని తూర్పుమొగసాల, బాలాజీ థియేటర్ సమీపంలోని కాలనీలు, తోపుమఠం, ఎంబీటీ రోడ్డు, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి, టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పుంగనూరులో టీడీపీ గెలుపు ఖాయమని చెప్పారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాజెక్టుల పేరుతో రైతుల భూములు లాక్కొని, వారికి పరిహారం డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని దుయ్యబట్టారు. అనంతరం స్థానిక దూళ్లవాళ్లఇండ్లు, మేలుపట్లకు చెందిన 100 మంది యువకులు స్థానిక నాయకుడు దినేశ్ ఆధ్వర్యంలో చల్లా సమక్షంలో టీడీపీలో చేరగా.. పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు ఎం.శ్రీకాంత్, దినేశ్, మాధవరెడ్డి, సీవీరెడ్డి, పోలీస్‌గిరి, సుహేల్ బాషా, దేశాధి ప్రకాశ్, డీకే శ్రీనివాసులు, చంద్ర, ప్రసాద్, శ్రీనివాసులు, సద్దాం, రెడ్డెప్ప, రామయ్య, గాజుల రమణ, జనసేన నాయకులు విరూపాక్షి, నరేశ్‌రాయల్, హరినాయక్, చైతన్యరాయల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



రొంపిచెర్లలో వైసీపీ నుంచి వచ్చిన వారికి టీడీపీ కండువా కప్పుతున్న రామచంద్రారెడ్డి

టీడీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుంది

రొంపిచెర్ల: టీడీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. రొంపిచెర్లలోని ఆయన ఇంటి వద్ద పులిచెర్ల మండలం రేణుమాకులపల్లెకి చెందిన సుబ్బరాజు, నన్నూరివారిపల్లె పంచాయతీ ఎగువబెస్తపల్లెకి చెందిన ఎ.విశ్వ కుటుంబసభ్యులు వైసీపీనివీడి టీడీపీలోకి చేరారు. రామనాధంనాయుడు, భాస్కర, నాగరాజనాయుడు, దేవా, మునీంద్ర, సయ్యద్ బాషా పాల్గొన్నారు,

రామకుప్పం: మండల పరిధిలోని భగలనత్తం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు శ్రీనివాసులు రెడ్డి తన అనుచరులతో కలిసి టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. బందార్లపల్లె పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు శ్రీనాథ్, యూనిట్ ఇన్‌చార్జి మునిరెడ్డి, నేతలు నందారెడ్డి, సుబ్రియన్, మురళి, రాఘవేంద్ర, మంజునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళాన్ని విజయవంతం చేద్దాం: టీడీపీ



సమావేశంలో ప్రసంగిస్తున్న సోమశేఖర్‌గౌడ్

గంగవరం, మార్చి 25: పలమనేరులో బుధవారం జరగనున్న ప్రజాగళం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని టీడీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మండల, పంచాయతీ స్థాయి నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎన్నికల కోడ్ వచ్చాక తొలిసారిగా పలమనేరుకు పార్టీ అధినేత చంద్రబాబు విచ్చేస్తున్నారని అన్ని పంచాయతీల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. నాయకులు ప్రసాద్‌నాయుడు, వెంకట్రామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మురళి, గిరిధర్‌గోపాల్, యుగందర్, రవి, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

వి.కోట: పలమనేరులో బుధవారం జరగనున్న ప్రజాగళం సభను విజయవంతం చేయాలని టీడీపీ శ్రేణులకు పార్టీ మండల అధ్యక్షుడు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ పిలుపునిచ్చారు. దీనిపై సోమవారం పట్టణంలోని పీఎంఆర్ కళ్యాణ మండపంలో మండల పరిధిలోని 18 పంచాయతీల పార్టీ అధ్యక్షులు, యూనిట్ ఇన్‌చార్జులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆరోజున ఉదయం ఎనిమిది గంటలకు వి.కోట నుంచి బైక్ ర్యాలీ ఉంటుందని చెప్పారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధులు చౌడప్ప, రాంబాబు, మండల తెలుగు యువత అధ్యక్షుడు ధీరజ్, జిల్లా కార్యదర్శి శబరీష్, మాజీ వైస్ ఎంపీపీ గోపినాథ్, నాయకులు సోమశేఖర్, నాగభూషణం, శివకుమారి, త్యాగరాజ్, షేక్ ఉమ్మర్, పట్టణ అధ్యక్షుడు నారాయణస్వామి, నాయకులు చంద్రరెడ్డి, నాసీర్, రుహుల్లా, విశ్వనాథ్, సతీష్, విశ్వనాథరెడ్డి, హరినాథరెడ్డి, నాగరాజ్, వెంకట్రామప్ప పాల్గొన్నారు.



వి.కోట జరిగిన సమావేశంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు

వాహనాల తనిఖీ

సోమల, మార్చి 25: ఎస్పీ ఆదేశాలతో సోమవారం సోమల పద్మశ్రీ సినిమా హాలు వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు అక్రమంగా డబ్బు, మద్యం,ఇతర వస్తువులు రవాణాచేస్తే చర్యలు తప్పవన్నారు.

వైసీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలి: బీజేపీ



పుంగనూరులో ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

పుంగనూరు రూరల్, మార్చి 25: వైసీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. రాజంపేట పార్లమెంటుకు బీజేపీ అభ్యర్థిగా మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని ప్రకటించడంపై సోమవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో టపాకాయలు పేల్చారు. రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపట్టిన నెలరోజుల్లోపే మదనపల్లెను జిల్లాగా ప్రకటించడం జరుగుతుందని మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు అయూబ్‌ఖాన్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నానబాల కుమార్, డిష్ రాజారెడ్డి, పెద్దమఠం బాబు, ఆదినారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చక్రస్నానం



సోమల, మార్చి 25: ఆవులపల్లెలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహోత్సవాల సందర్భంగా సోమవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిపారు. ఉదయం ఆలయంలో మూల విరాట్‌కు అభిషేకపూజలు, పురోహితులు హోమాధికార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను హసం వాహనంపై అధిష్ఠింపజేసి, ఊరేగించారు. పెద్దఉప్పరపల్లె, పేటూరు, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె పంచాయతీల్లోని బ్రాహ్మణ, దేవాంగలు ఉభయదారులుగా వ్యవహరించారు.

నేత్రానందంగా నలగుండ్రాయస్వామి రథోత్సవం



బైరెడ్డిపల్లె, మార్చి 25: కడపనత్తంగ్రామంలో ఉన్న నలగుండ్రాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవాన్ని నేత్రానందంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలివేలుమంగ, పద్మావతీ సమేత నలగుండ్రాయస్వామి ఉత్సవర్లకు ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు జరిపారు. తర్వాత శాస్త్రోక్తంగా రథాంగహోమం నిర్వహించి, రథంలో కొలువుదీర్చారు. మేళతాళాలు, గోవిందనామ స్మరణలమధ్య భక్తులు రథాన్ని లాగారు. ఆలయంవద్ద అన్నదానం ఏర్పాటుచేశారు. ఆలయధర్మకర్త మురళి, కమిటీసభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాళభైరేశ్వరస్వామికి పూజలు



బైరెడ్డిపల్లె, మార్చి 25: కుప్పనపల్లె గ్రామసమీపంలోని కాళభైరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు మురళీధరాచార్యులు స్వామివారికి విశేషాలంకరణ చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమానికి సుధారాణి, మేఘరాజు ఉభయదారులుగా వ్యవహరించారు. అలాగే బైరెడ్డిపల్లె పట్టణంలోని శేషాద్రిస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వాహకుడు ధనంజయగౌడు ఆధ్వర్యంలో జరిగాయి. చిరంజీవిభాగవతార్ బృందం హరికథ, భజనలు, హరినామసంకీర్తన అలరించాయి.

అలరించిన 'శ్రీకృష్ణ లీలలు'



కల్లూరు, మార్చి 25: మహాభారత ఉత్సవాల్లో భాగంగా పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లె పంచాయతీ ఎలకబైలు మహాభారత యజ్ఞం ప్రాంగణంలో సోమవారం రాత్రి శ్రీకృష్ణ లీలలు వీధినాటకం భక్తులను అలరించింది. మధ్యాహ్నం భాగవతారిణి పూర్ణిమ కురుపాండవ అభ్యుదయం కథను వినిపించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

పలమనేరు, మార్చి 25: జగమర్ల గ్రామంలో సోమవారం ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ సమాఖ్యలోని మహిళా సంఘాల సభ్యులకు స్వీప్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి



రాణి (ఫైల్ ఫొటో)

బైరెడ్డిపల్లె, మార్చి 25: ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. బైరెడ్డిపల్లె ఏఎస్‌ఐ త్యాగరాజన్ తెలిపిన వివరాల మేరకు.. బైరెడ్డిపల్లె ఎస్సీకాలనీకి చెందిన రాణి(33) భర్త రెడ్డెప్ప ఐదేళ్ల కిందట మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె కూలిపనులు చేసుకుంటూ కుమార్తెను పోషించుకుంటోంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం నుంచి రాణి కనిపించలేదు. సోమవారం ఉదయానికి మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో ఆమె మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, రాణి శరీరంపై చిన్న చిన్న గాయాలు కనిపించడంతో బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కుప్పం, మార్చి 25: క్షయ రహిత సమాజమే లక్ష్యమని కుప్పం ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ విజయ కుమార్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినం సందర్భంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్లు చాందిని, కిశోర్, హరి, ఐసీటీసీ సిబ్బంది, బీసీఎన్ విద్యార్థులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

నగరి, మార్చి 25: నగరి పట్టణ పరిధిలోని చింతలపట్టెడ నుంచి ఏకాంబరకుప్పానికి వెళ్లే మార్గంలో చెరువుకట్టపై గల కనికలమ్మ ఆలయంలో చెట్టుకు ఉరివేసుకుని భాస్కర్(45) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. వ్యక్తిగత తగాదాల కారణంగా ఏకాంబరకుప్పానికి చెందిన భాస్కర్ ఉరివేసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈమేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా వైద్యశాలకు తరలించినట్లు సీఐ సురేష్ తెలిపారు.

కన్నుల పండువగా రథోత్సవం/ అశ్వ వాహనంపై విహరించిన కల్యాణ వెంకటరమణ స్వామి



అశ్వవాహనంపై స్వామివారు





రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పుంగనూరు రూరల్, మార్చి 25: పుంగనూరు కల్యాణ వెంకటరమణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం అమ్మవార్లతో కలిసి శ్రీవారు పట్టణంలో రథంపై కన్నుల పండువగా ఊరేగారు. టీటీడీ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు హోమాలు, పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవర్లు రథంలో కొలువుదీరగా జమీందారీ కుటుంబసభ్యులు ఆనవాయితీగా స్వామి వారికి తొలిపూజలు చేశారు. అనంతరం రథాన్ని మంగళవాయిద్యాలు, చెక్కభజనల, గోవిందనామస్మరణల మధ్య భక్తులు లాగారు. రాత్రి అశ్వవాహనంపై శ్రీవారు ఊరేగారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇన్‌స్పెక్టర్ మునేంద్రబాబు, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, పృథ్వీరాజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం
ఇద్దరి అరెస్టు

పుంగనూరు రూరల్, మార్చి 25: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 600 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాఘవరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన ఆర్షద్‌అలీ ఆటోలో 200 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తీసుకొస్తుండగా మాగాండ్లపల్లె చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో గుర్తించారు. మద్యంతోపాటు ఆటోను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశారు. అలాగే.. డాన్‌బోస్కో పాఠశాల వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టణానికి చెందిన జూనేద్ కూడా ఆటోలో కర్ణాటక మద్యం 400 టెట్రా ప్యాకెట్లు తీసుకొస్తుండగా గుర్తించారు. మద్యాన్ని, ఆటోను సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేశారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు సుబ్బారెడ్డి, రఫీక్, సిబ్బంది పాల్గొన్నారు.

హోలీ సందడి

కల్లూరు, మార్చి 25: పులిచెర్ల మండలం కల్లూరులో సోమవారం రాజస్థానీ యువతీ యువకులు హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకుని సందడి చేశారు.

రొంపిచెర్ల: మండలంలోని జరిగిన సంబరాల్లో చిన్నాపెద్దా రంగులు చల్లుకుంటూ డ్యాన్సులు వేశారు. నెమిచాంద్‌పటేల్, దుర్గారాం, రవి, సురేష్, దీపక్, సోను, ఎర్రంరెడ్డి, మునిక్రిష్ణఆచారి, శంకర్, మిటులాల్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: సుగాలిమిట్టలో గిరిజనులు, పట్టణంలోని మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన మరాఠీలు, స్థానికులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని హోలీ పండుగను జరుపుకున్నారు. మిఠాయిలు పంపిణీ చేశారు.

సోమల: హోలీ పండుగను మండలంలో ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. సోమల, నంజంపేట, కందూరు, పెద్దఉప్పరపల్లెల్లో యువత సందడి చేసింది.

చౌడేపల్లె: హోలీ సందర్భంగా చౌడేపల్లెలోని మార్వాడీలు రంగులు చల్లుకుంటు, డ్యాన్సులు చేశారు. బంధు మిత్రులకు స్వీట్లు పంచిపెట్టారు.

వి.కోట: వి.కోటలో మార్వాడీలు రంగులు చల్లుకుంటూ, ఒకరికొకరు హోలి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కల్లూరులో..



రొంపిచెర్లలో..

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

బృందావనానికి తెల్లరంగు వేయించారు



కొదలమడుగులో వైసీపీ రంగుతో వున్న బృందానం (నిన్న), తెల్ల రంగు వేశారిలా (నేడు)

బంగారుపాళ్యం, మార్చి 25: 'వైసీపీ రంగుల పిచ్చి బంగారుపాళ్యం మండలం కొదలమడుగులోని డంపింగ్ యార్డునూ వదల్లేదు. కోడ్ వచ్చినా ఈ రంగులను అధికారులు మార్చలేదు' అని ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి సోమవారం తెల్లరంగు వేయించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉత్సాహంగా ఉల్లాసంగా హోలీ వేడుకలు

చిత్తూరు కల్చరల్, మార్చి 25: నగరంలో ఉత్తర భారతదేశానికి చెందిన పలువురు సోమవారం హోలీ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. నగర పరిసర ప్రాంతమైన ముత్తర పల్లె తోటలో చిత్తూరు జైన్ సంఘం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోలీ వేడుకల్లో రాజాస్థానీ మహిళలు సామూహికంగా దూండ్ (బృంద నాట్యం) చేశారు. నగరంలోని ఉత్తరాఖండ్, ఝార్ఖండ్, బిహార్, యూపీ, గుజరాత్, మహారాష్ట్ర, బెంగాల్ వాసులు హోలీ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు.

ఐరాలలో....

ఐరాల, మార్చి 25: మండల కేంద్రమైన ఐరాలలో సోమవారం హోలీ వేడుకలను మార్వాడీ కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకోవడంతో పాటు గ్రామస్తులపై రంగులు చల్లి వేడుకలు నిర్వహించుకున్నారు. అనంతరం గ్రామస్తులకు స్వీట్లు పంచారు.


ఐరాలలో హోలీ నిర్వహిస్తున్న మార్వాడీలు

బంగారుపాళ్యంలో....

బంగారుపాళ్యం, మార్చి 25: మండల కేంద్రంలో యువకులు, మార్వాడీలు సోమవారం ఘనంగా హోలీ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా... ఆదరించండి

- చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఎంపీ అభ్యర్థి ప్రసాదరావు

చిత్తూరు సిటీ, మార్చి 25: జిల్లా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు చెప్పారు. సోమవారం కుప్పంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో మహిళా కుటుంబ సాధికార సారథుల ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో ప్రసాదరావు మాట్లాడుతూ చంద్రబాబు ముందుచూపు, రాష్ట్ర అభివృద్ధిపై ఆయనకున్న విజన్ చూసి రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఐటీ రంగంతో పాటు ఇతర అన్ని రంగాలు అభివృద్ధి పథంలో నడిచాయని పేర్కొన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. తనకు జిల్లాపై అవగాహన ఉందని, ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి సమస్యలను గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన


ఎస్వీసెట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 25: త్వరలో జరుగబోవు సార్వత్రిక ఎన్నికలు - 2024కు సంబంధించి స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు అనువుగా గుర్తించిన శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎస్వీసెట్)ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ సోమవారం పరిశీలించారు. పోలింగ్ అనంతరం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాలు ఏర్పాటుకు ఉన్న వసతులను ఆయన అక్కడ పరిశీలించారు. కళాశాలలో వున్న గదుల్లో కౌంటింగ్‌కు అనువైన ప్రదేశాలు, ఈవీఎంలు భద్రపరిచేందుకు తగిన ప్రాంతాలు, మూడంచెల భద్రతా ఏర్పాట్లు, కౌంటింగ్ కోసం రానున్న అభ్యర్థుల ఏజెంట్లకు సంబంధించిన వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లను అధికారులతో చర్చించారు. కలెక్టర్ వెంట జేసీ పి. శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, రెవెన్యూ, సర్వే అధికారులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో శివజ్యోతి జయంతి ఉత్సవాలు


గిరింపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ సభ్యులు

చిత్తూరు కల్చరల్, మార్చి 25: నగరంలోని ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ (ఓం శాంతి) నిర్వాహకులు ఫాల్గుణ మాసం పౌర్ణమి రోజైన సోమవారం శివ జ్యోతి జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. స్థానిక గిరింపేటలో బ్రహ్మకుమారీస్ సభ్యులు ఈశ్వరీయ శాంతి సందేశంతో కూడిన ప్రేమతత్వ ప్ల కార్డులను చేతబూని శివ నామామృతం గానం చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి. కె. వసుధ, వీణా, వాణి, జ్యోతి, సుబ్రమణ్యం రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో బ్రహ్మకుమారీస్ సభ్యులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌లో అన్నదానం

పూతలపట్టు, మార్చి 25: స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన అన్నక్యాంటీన్‌లో సోమవారం అన్నదాన కార్యక్రమానికి ఎన్‌ఆర్‌ఐ ఊట్ల శ్యామ సుందరరావు తండ్రి ఊట్ల నాగరాజు నాయుడు, బావ హేమాద్రి నాయుడు ఆధ్వర్యంలో భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఏకాంబరం, భాస్కర్, వీరభద్రయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

నగరి, మార్చి 25: నగరి పట్టణ పరిధిలోని చింతలపట్టెడ నుంచి ఏకాంబరకుప్పానికి వెళ్లే మార్గంలో చెరువుకట్టపై గల కనికలమ్మ ఆలయంలో చెట్టుకు ఉరివేసుకుని భాస్కర్(45) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. వ్యక్తిగత తగాదాల కారణంగా ఏకాంబరకుప్పానికి చెందిన భాస్కర్ ఉరివేసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈమేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా వైద్యశాలకు తరలించినట్లు సీఐ సురేష్ తెలిపారు.

సారా స్వాధీనం: ఒకరి అరెస్టు

గుడిపాల, మార్చి 25: మండలంలోని కమ్మతిమ్మాపల్లిలో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కమ్మతిమ్మాపల్లి, చలిచీమలపల్లికి వెళ్లే రహదారిలోని చెరువు దగ్గర జయవేలు అనే వ్యక్తి సారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అతడి వద్ద ఉన్న 90 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ రూ.15 వేలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండుకు పంపినట్లు పేర్కొన్నారు.

ఎస్‌ఆర్‌ఆర్ కండ్రిగ సర్పంచ్ మృతి


జయలక్ష్మి (ఫైల్‌ఫొటో)

పాలసముద్రం, మార్చి 25: మండలంలోని ఎస్‌ఆర్‌ఆర్ కండ్రిగ పంచాయతీ సర్పంచ్ కొండూరు జయలక్ష్మి (73) సోమవారం మృతి చెందారు. ఆమె గత కొన్నిరోజులుగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ మృతి చెందారు. సర్పంచ్ ఎన్నికల్లో జయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమె కుమారుడు కె. మోహన్‌రాజు తిరుపతిలో వ్యాపారవేత్త. తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. ఆమె అంత్యక్రియలు మంగళవారం ఉదయం ఎస్‌ఆర్‌ఆర్ కండ్రిగలో నిర్వహించనున్నారు.

రేపు వాహనాల వేలం

చిత్తూరు సిటీ, మార్చి 25: ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ అర్బన్ సీఐ విజయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు అర్బన్ ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 6 ద్విచక్ర వాహనాలను ఈనెల 27న బుధవారం వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగలవారు నగరంలోని పాత కోర్టువద్ద ఉన్న ఎస్ఈబీ అర్బన్ స్టేషన్‌లో ఉదయం 10 గంటలకు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

రేపు పుత్తూరులో చంద్రబాబు సభను విజయవంతం చేద్దాం

నింద్ర, మార్చి 25: ఈ నెల 27న బుధవారం మధ్నాహ్నం 2గంటలకు పుత్తూరులో జరిగే చంద్రబాబు రోడ్ షో, బహిరంగ సభను విజయవంతం చేద్దామని నగరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రమైన నింద్రలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు, మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు రవికుమార్, మనోహర్ నాయుడు, ఓంప్రకాష్, గాలి రమేష్‌నాయుడు, ప్రకాష్, జనసేన నాయకులు మెరుపుల మహేష్, శివలింగం, బీజేపీ నాయకులు రమేష్, భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

నగరి: పుత్తూరులో ఈ నెల 27వ తేదీన చంద్రబాబు పాల్గొనే ప్రజాగళం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. నగరి పట్టణ టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన ఆపార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త స్వచ్చందంగా కదిలి వచ్చి పుత్తూరులో చంద్రబాబు రోడ్‌షో, బహిరంగసభను విజయవంతం చేయాలన్నారు.

గురజాలకు ఎన్టీఆర్ పురస్కారం



ఎన్టీఆర్ పురస్కారాన్ని అందుకుంటున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 25: జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ గురజాల జగన్మోహన్‌కు ఎన్టీఆర్ పురస్కారం లభించింది. స్థానిక భారతీయ తెలుగు రచయితల సమాఖ్య కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఎన్టీఆర్ అంతర్జాతీయ పురస్కారాన్ని సమాఖ్య జాతీయ గౌరవాధ్యక్షుడు మర్రిపూడి దేవేంద్ర రావు సోమవారం గురజాల జగన్మోహన్‌కు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గురజాల మాట్లాడుతూ ఎన్టీఆర్ అడుగు జాడల్లో నడుస్తున్న తనకు ఈ పురస్కారం రావడంతో మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో సంఘ సేవకులు ఆనంద నాయుడు, మొహిద్దీన్ అలీ, మోహన్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చక్రస్నానం

సోమల, మార్చి 25: ఆవులపల్లెలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహోత్సవాల సందర్భంగా సోమవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిపారు. ఉదయం ఆలయంలో మూల విరాట్‌కు అభిషేక పూజలు, హోమాధి కార్యక్రమాలు నిర్వహించారు.

సరిహద్దుల్లో గట్టి బందోబస్తు: డీఎస్పీ



గుడిపాల, మార్చి 25: ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉన్నందున తమిళనాడు సరిహద్దులో వున్న గొల్లమడుగు, శాంతిపురం చెక్‌పోస్టుల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ రాజేశ్వర్ రెడ్డి, వెస్ట్ సీఐ రవిశంకర్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాల్లో ఎవరైనా మద్యం అక్రమ రవాణా చేపట్టినా, నగదు తీసుకొచ్చినా చెక్‌పెడతామని తెలిపారు. ఎవరైనా అనుమానితులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతిరోజూ వాహనాల తనిఖీలు చేయడం జరుగుతుందని, ఎవరైనా పట్టుబడినా ఎంతటివారినైనా వదిలే ప్రసక్తి లేదని తెలిపారు. అనంతరం పలు కేసులపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాస రావు ఉన్నారు.

మీ ఓటు నిర్భయంగా వేసుకోండి

మీ ఓటు మీరు నిర్భయంగా వేసుకోవాలని డీఎస్పీ రాజేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం కొత్తపల్లిలో ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ సీఐ రవిశంకర్, ఎస్‌ఐ శ్రీనివాస రావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల భూదాహం వల్లే

నేతన్న కుటుంబం ఆత్మహత్య


నెల్లేపల్లెలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న శ్రీధర్‌యాదవ్ తదితరులు

గంగాధరనెల్లూరు, మార్చి 25: వైసీపీ నేతల భూదాహం వల్లే రాజంపేట జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరానికి చెందిన నేతన్న పాల సుబ్బరావు కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందని జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ ఆరోపించారు. సుబ్బారావు కుటుంబం ఆత్మహత్య చేసుకుని మరణించడానికి కారణమైన వైసీపీ దాష్టీకాన్ని తీవ్రంగా ఖండిస్తూ గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లె పంచాయతీలో సోమవారం రాత్రి పలువురు యాదవ కుటుంబాలకు చెందిన మహిళలు, పురుషులు కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను బలి తీసుకోవడం సీఎం జగన్‌కు పరిపాటిగా మారిందని ధ్వజమెత్తారు. ఈకార్యక్రమంలో జిల్లా టీడీపీ లీగల్‌సెల్ అధికార ప్రతినిధి లాయర్ శరవణకుమార్, నేతలు మునిరాజుల యాదవ్, జ్యోతియాదవ్, మండల టీడీపీ బీసీ మహిళాధ్యక్షురాలు లోకమ్మ, వరదరాజులు, వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమితో వైసీపీలో ఓటమి భయం


ప్రచారంలో పాల్గొన్న టీడీపీ, బీజేపీ, జనసేన నేతలతో గురజాల

చిత్తూరు సిటీ, మార్చి 25: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమితో వైసీపీలో ఓటమి భయం పట్టుకుందని ఆ పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. సోమవారం ఉదయం స్థానిక 1వ డివిజన్ దొడ్డిపల్లెలోని కన్నికలమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అగ్రహారంలోని బ్రాహ్మణవీధి, జీకే నగర్ పెద్దకొత్తూరు, 2వ డివిజన్ మురకంబట్టులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సాయంత్రం దొడ్డిపల్లెలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి ఇందిరమ్మ కాలనీ, 50వ డివిజన్ కనకదుర్గవీధి తదితర ప్రాంతాల్లో టీడీపీ కరపత్రాలను పంచిపెట్టారు. గురజాల మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని చెప్పారు. రాష్ట్రం బాగుపడాలంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుని చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు బాలాజీ, వసంత్‌కుమార్, వెంకటేష్ యాదవ్, రాజశేఖర్, నిత్యానందం, ఉదయ్‌కుమార్, రమణ, డిన్ను, గోపాలకృష్ణ, ఎల్ఐసీ గోపి, రాణి, వరలక్ష్మి, క్రిష్ణమూర్తి, అట్లూరి శ్రీనివాసులు, దయారాం, ఏకే శరవణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని టీడీపీ నేతల గిరి ప్రదక్షిణ


తిరువణ్ణామలైలో గిరి ప్రదక్షిణ చేస్తున్న మండల టీడీపీ నాయకులు

పాలసముద్రం, మార్చి 25: టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తమిళనాడులోని తిరువణ్ణామలైలో కొండచుట్టూ ప్రదక్షిణ చేసి ఆయన పేరుమీద పాలసముద్రం మండల టీడీపీ నాయకులు పూజలు చేశారు. మండలంలోని ఎస్‌ఆర్‌ఆర్ కండ్రిగ పంచాయతీ టీడీపీ ప్రెసిడెంట్ కృష్ణమ నాయుడు ఆధ్వర్యంలో అరుణాచలేశ్వరుడి 14 కి.మీ. కొండచుట్టూ ప్రదక్షిణ చేసి, అనంతరం స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ జెండాను భుజాన పెట్టుకుని గిరిప్రదక్షిణ చేశారు. నాయకులు వినోద్‌కుమార్, వెంకటేశులు, నవీన్ కుమార్, అబ్బిరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపుతోనే చిత్తూరు అభివృద్ధి సాధ్యం


ప్రతిమకు హారతులిస్తున్న మహిళలు

చిత్తూరు రూరల్, మార్చి 25: చిత్తూరు అభివృద్ధి చెందాలంటే కూటమి గెలుపుతోనే సాధ్యమని చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ అన్నారు. సోమవారం చిత్తూరు రూరల్ మండలంలోని తుమ్మింద, నాయనిచెరువు, పెద్దిశెట్టిపల్లి, తొప్పాతిపల్లి పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిత్తూరును స్మార్ట్ సిటీగా మార్చాలంటే జగన్మోహన్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రతిమకు మహిళలు హారతులు పట్టారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, రఘు, మేషాక్, రాజేంద్ర, రామ్మూర్తి, కాశీ, కాటంరాజు, బాలక్రిష్ణ, పురుషోత్తం, రాజా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి


శ్రీహరిపురంలో భానుప్రకాష్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

విజయపురం, మార్చి 25: మండలంలోని శ్రీహరిపురంలో వైసీపీ ప్రధాన కార్యదర్శి ఆషాది ప్రకాష్ యాదవ్, అతడి అనుచరులు కుప్పయ్య, బాలకృష్ణ, అయ్యప్ప, కాటయ్య, వెంకటేశులు, నాని, సుధాకర్, యశ్వంత్, మునికృష్ణ, రోహిత్, నవీన్, ప్రశాంత్, రమేష్, చిరంజీవి తదితరులు నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వైసీపీలో కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు లేదని, ఎలాంటి అభివృద్ధి జరుగనందున టీడీపీలో చేరినట్లు వారు ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం కోసలనగరంలో టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ బుధవారం పుత్తూరులో జరిగే చంద్రబాబు పర్యటనలో ఎక్కువ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కోసలనగరంలో ఇటీవల మృతి చెందిన కోడూరు మణి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు, రాష్ట్ర టీడీపీ బీసీ అధికార ప్రతినిధి ధనుంజయ యాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు చిన్నబ్బరాజు, జయకృష్ణ, జయరామరాజు, నారాయణరాజు, సురేష్, డీఎస్‌రాజు, దశరథరాజు, సుధాకర్‌రాజు, నాగభూషణం యాదవ్, మణి టీడీపీ, జనసేన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నగరిలో....

నగరి, మార్చి 25: నగరి పట్టణం, మండల పరిధిలోని వైసీపీ నాయకులు సోమవారం టీడీపీలో చేరారు. నగరి పట్టణంలో నాల్గవ వార్డుకు చెందిన డాక్టర్ గుణశేఖర్, ఆయన అనుచరులు, గుండ్రాజుకుప్పంలో వడ్డెర్లకు చెందిన కొందరు టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. చిత్తూరు పార్లమెంటరీ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, బాబు సాహెబ్, వినాయకుడు తదితరులు పాల్గొన్నారు.

గురజాలను ఆశీర్వదించండి

గుడిపాల, మార్చి 25: స్థానిక నాయకుడు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడుకు అవకాశం కల్పించి, ఆశీర్వదించాలని జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని వసంతాపురం పంచాయతీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు ధనుంజయ నాయుడు, నాయకులు ప్రతాప్ నాయుడు, రవి నాయుడు, విజయ్‌భాస్కర్ నాయుడు, మనోహర్, శేఖర్, బాబు రెడ్డి, చిన్నబ్బ నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

నగరి, మార్చి 25: ఆంధ్రప్రదేశ్ మహిళాసమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నగరిలో సోమవారం ఆ సంఘం నాయకురాలు రాజేశ్వరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు చందామల్లై, జిల్లా నాయకురాలు నగోమి మాట్లాడుతూ మగవారికి దీటుగా మహళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని చెప్పారు.

గుట్టుగా పశువుల గుట్ట ఆక్రమణ

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు


పశువుల గుట్టను ఆక్రమించి మామిడి మొక్కలు నాటిన దృశ్యం

కార్వేటినగరం, మార్చి 25: కార్వేటినగరం మండలం ముక్కరవాణి పల్లె పంచాయతీ పరిధిలో గంగమాంబపురం సర్వేనెంబర్ 210లో ఏడు ఎకరాల పశువుల గుట్ట ఆక్రమణకు గురైంది. దీనిపై కార్వేటినగరం రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. పశువుల గుట్టను ఆక్రమించడమే కాకుండా ఆ స్థలంలో మామిడి మొక్కలను సైతం నాటారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మండలంలో భూఆక్రమణలకు పాల్పడే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మండల రెవెన్యూ కార్యాలయంలో కిందిస్థాయి సి బ్బంది భూ ఆక్రమణదారులకు లోపాయికారిగా సహకరిస్తున్నారని, ఆక్రమణకు గురైన పశువుల గుట్టను వెంటనే రక్షించాలని స్థానికులు జిల్లాకలెక్టర్‌ను కోరుతున్నారు.

ఆక్రమణలకు గురైన మంచినీళ్లకుంట

- సర్వే జరిపి చర్యలు తీసుకుంటామన్న తహసీల్దార్

వెదురుకుప్పం, మార్చి 25: వెదురుకుప్పం మండలం జక్కిదొన రెవెన్యూ లెక్కదాఖలాలోని సర్వే నంబరు-468లో ఉన్న మంచినీళ్లకుంట ఆక్రమణకు గురైందని జక్కిదొన గ్రామస్తులు సోమవారం తెలిపారు. ఈ భూమిని అదే గ్రామానికి చెందిన ఒకరు ఆక్రమించుకున్నారని వెదురుకుప్పం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని గ్రామస్తులు చెప్పారు. ఈ ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని స్థానికులు హెచ్చరించారు. ఈ విషయమై వెదురుకుప్పం తహసీల్దార్ జయంత్‌కుమార్ స్పందిస్తూ.. మంచినీళ్లకుంట ఆక్రమణకు గురైన విషయం తమ దృష్టికి వచ్చిందని, సర్వే జరిపి ఆక్రమణలకు గురై ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు.

పేదలకు అన్నదానం

బంగారుపాళ్యం, మార్చి 25: బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద సోమవారం మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ పేదలకు భోజనం వితరణ చేశారు. నాయకులు రాధాక్రిష్ణమ నాయుడు, గిరిబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి పూజలు


ప్రత్యేక అలంకారంలో మూలవర్లు

చిత్తూరు కల్చరల్, మార్చి 25: నగరంలోని గంగనపల్లె బోడికొండ మృత్యుంజయ వీరాంజనేయస్వామి ఆలయంలో సోమవారం విశ్వహిందూ పరిషత్ నాయకులు సీతారామాంజనేయ స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. నగరంలోని గుర్రప్ప నాయుడు వీధి అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పౌర్ణమి పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అంగరంగ వైభవంగా పుష్పపల్లకి సేవ

చిత్తూరు కల్చరల్, మార్చి 25: నగరంలోని కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయ పంగుణి మాస బ్రహ్మోత్సవాలు గత 12 రోజులుగా నిర్వహిస్తున్న సంగతి తెల్సిందే. సోమవారం ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని దివంగత రవీంద్ర నాయుడు, పాండురంగ నాయుడు, ప్రసాద్‌నాయుడుల ఉభయంతో స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూలరథంపై అధిష్ఠింపజేసి పుర వీధుల్లో భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవో తిమ్మారెడ్డి, ఉత్సవ నిర్వాహకులు శివప్రసాద్, మల్లీ ఆచారి, కాళభైరవట్రస్టు వ్యవస్థాపకులు టి. వెంకటేషన్, చాణ్యక్య రవి, విజయలక్ష్మి బాబు, భక్తులు పాల్గొన్నారు.

అర్ధగిరిలో ఘనంగా పౌర్ణమి వేడుకలు


సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తవణంపల్లె, మార్చి 25: ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. భక్తులకు దర్శనం గావించి, స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాల నడుమ ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తుల కాలక్షేపం నిమిత్తం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కొండ మల్లీశ్వరుడికి పాలాభిషేకం

వెదురుకుప్పం, మార్చి 25: డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో కొలువై ఉన్న జ్ఞానప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామికి సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అన్నమయ్య, శివ సంకీర్తనలు ఆలపించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాదం వితరణ చేశారు. అలాగే ఎగువ కన్నికాపురంలో స్వయంభు సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు.

సిద్ధేశ్వరకొండలో...

బంగారుపాళ్యం, మార్చి 25: మండలంలోని చీకూరుపల్లిలోని సిద్ధేశ్వర కొండపై వెలసివున్న పార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు.

వైభవంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి చక్రస్నానం


స్వామి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

శ్రీరంగరాజపురం, మార్చి 25: ఎస్‌ఆర్ పురం మండలం మంగుంట గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు చివరి రోజైన సోమవారం చక్రస్నానంతో ముగిశాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాతం, అభిషేకం, మహా మంగళహారతి, కలశస్థాపన, వాస్తు పూజ, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమణప్రసాద్‌రెడ్డి, గుణశేఖర్ నాయుడు, మోహన్ ప్రసాద్, గిరిబాబు, జయపద్ర, హరిబాబు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా పార్వతీ, మల్లేశ్వరస్వామి కల్యాణం

గంగాధరనెల్లూరు, మార్చి 25: ఉత్తర ఫల్గుణి నక్షత్రంలో భాగంగా మండలంలోని క్రొట్రకోనలో వెలసిన పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం ప్రధాన గర్భగుడిలో శివలింగానికి ప్రత్యేక అభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులైన స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కె.లక్ష్మీరెడ్డిపల్లెకు చెందిన యాదవ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించగా, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు, కార్యదర్శి యుగంధరాచ్చారి, భక్తులు పాల్గొన్నారు.